# జీవకారుణ్యం

"మీరు ఉభయులు రేపు రాత్రి మా ఇంటికి తప్పక భోజనానికి రావాలి.' అని చంద్రం, అతని భార్య సుశీల ఒక్కమాటుగా అన్నారు.

"ఏమిటి విశేషం... మీ మ్యారేజి యానివర్శరీయా? లేక పిల్లల పుట్టినరోజు పండుగా" అని శివరామ్ అడిగాడు.

"మీ మ్యారేజ్ యూనివర్శరీ జూన్‌లో కదా" అని శివరామ్ భార్య శ్యామల అడిగింది.

"అదేమీ కాదు. మా కుటుంబానికి ప్రమోషన్ వచ్చింది."

"నీ కంపనీకి నువ్వేగా మేనేజింగ్ డైరెక్టరువి. పైగా అది మీ స్వంత కంపెనీ. ఇంకొక ఇండస్ట్రీ ఏదైనా స్థాపిస్తున్నావా?"

"అవేమి కాదు. నేను మా ఆవిడ - మా పిల్లలు సకుటుంబముగా దత్తతకు వెడుతున్నాము."

"నాకు అర్థమయ్యేలాగా తెలుగు భాషలో చెప్పు. ఈ వయస్సులో మీరు దత్తత వెళ్ళడం ఏమిటి. మేము మీ ఇంటికి భోజనానికి రావడం-ఇదేమి నాకు అర్థం కావటం లేదు."

చంద్రం సంతోషంగా నవ్వాడు. "నాకు కూడా మొదట్లో అర్థం కాలేదు. అర్థమైన తరువాత చాలా ఆనందం కలిగింది. ఈ ఆనందంలో మీరు కూడా పాలు పంచుకోవాలని మా కోరిక. అందుకనే ఈ ఆహ్వానం."

"మిమ్మల్ని అందరిని సకుటుంబ సపరివారంగా దత్తత చేసుకుంటున్న ఆ అమాయకులు ఎవరు?"

"మామూలుగా ఆలోచిస్తే వాళ్ళు అమాయకులుగా కనిపించినా, ఆ దంపతులు మాకు మహావ్యక్తులుగా కనిపించారు."

"ఎందుకని?"

"ఆ దంపతులని చూస్తే మనకు జాలి కన్నా అంతులేని గౌరవం కలుగుతుంది. ముందుతరం తల్లి దండ్రులు లాగా వీళ్ళు కూడా తమ సంతానం కోసం ఎంతో శ్రమించారు. ఎన్నో త్యాగాలు చేశారు. పిల్లలు పెద్ద పెద్ద చదువులు

చదువుకున్నారు. గొప్ప గొప్ప ఉద్యోగాలు సంపాదించుకున్నారు. పట్టణాలలో నివాసాలు ఏర్పరుచుకున్నారు. నాగరికత పెంచుకున్నారు. అప్పుడే సమస్యలు ప్రారంభం అయ్యాయి.

"ఏమిటా సమస్యలు?"

పిల్లల మనస్సులో ఒక ప్రశ్న వచ్చింది. మా కోసం కష్టాలు పడ్డామని త్యాగాలు చేశామని అంటున్నారు - మమ్మల్ని కనండి, మా కోసం కష్టాలు పడండి, త్యాగాలు చేయండి అని మేము అడిగామా, ప్రార్థించామా అని- కాయలకు తీగే బరువైయింది. ఇల్లు వాకిలి, పొలం, నగా నట్రా పిల్లల కోసం ఖర్చు పెట్టిన ఆ తల్లి తండ్రులకు పిల్లలు ఆశ్రయంగాని, ఆదరణగాని, సంతృప్తిగాని కలిగించలేక పోయారు. పైగా చిన్నచూపు చూశారు. మీరు ఈ భూమికి భారమన్నారు. పైకి అనకపోయినా మనస్సులో తిలోదకాలు ఇచ్చేశారు."

"అప్పుడు వాళ్ళు ఏమి చేశారు?"

"పిల్లల్ని శపించలేదు. తమ మీద తాము జాలిపడలేదు."

"ఏం చేశారు?"

"పిల్లలతో సంబంధం లేకుండా బ్రతకడం నేర్చుకున్నారు."

"ఎలా?"

"పిల్లలు కలగనప్పుడు వాళ్ళు ఎలా బ్రతికారో... ఆ విధంగా బ్రతకడం మళ్ళీ మొదలుపెట్టారు. ఒక నూతన జీవిత విధానానికి నాంది పలికారు."

"ఎలా?"

"ఇక్కడనుంచి ఓడిపోయి పారిపోకూడదు. నిలబడి గెలవాలి. అదీ, వారి నిర్ణయం... ఆయన అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. ఎవరికి ఏ సహాయం కావాలంటే అది చెయ్యడం, టెలిఫోన్ బిల్లులు, ఎలక్ట్రిసిటీ బిల్లులు వగైరా కట్టడం, ఇంటికి కావలసిన సరుకులు తెచ్చిపెట్టడం వంటి పనులు చేయడం మొదలు పెట్టాడు. ఆవిడ ఆడవాళ్ళకు చేదోడు వాదోడుగా ఉండటం, కావలసినవారికి ఇంటికి తమ యింటి దగ్గర వంటచేసి క్యారియర్ పంపడం, ఊరగాయలు పెట్టి పెట్టడం, చిన్నపిల్లలకు బేబీ సిట్టింగ్ చేయడం మొదలు పెట్టారు. ఆ సందర్భంగానే మాకు పరిచయం అయ్యారు. మేం మంచి శుభసమయంలో కలిసామనుకుంటాను. ఇటు అటు ఎవ్వరూ లేని నాకు మా ఆవిడకు - ఈ దంపతులు పెద్ద దిక్కు అయ్యారు. ఏనాడో కాలగర్భంలో కలిసిపోయిన మా తల్లితండ్రులు ఈ రూపంలో వచ్చినట్టు అనిపించింది. తాతయ్య, అమ్మమ్మ అంటే ఏమిటో, మనుమలు,

మనుమరాళ్ళమీద పెద్దవారికి ఎటువంటి ప్రేమ-అభిమానాలు ఉంటాయో ఊహించలేని మా పిల్లలకు ఆ లోటు తీరింది. మా పిల్లలు సంతోషంగా ఉన్నారు. మేము వాళ్ళకు మమ్మీ-డాడీలం కాదు- అమ్మా నాన్నలం...

పైకి అజ్ఞానిలాగా, అమాయకంగా కనిపించే ఆయన నిజానికి చాలా గొప్ప పండితుడు. మా అబ్బాయికి ఎన్నో సంస్కృత శ్లోకాలు నేర్పాడు. ఎన్నో సూక్తులు చెప్పాడు. ఆవిడ మా అమ్మాయికి ఎన్నో పద్యాలు, పాటలు నేర్పింది... మా పిల్లలే కాదు, ఇరుగు పొరుగు పిల్లలు కూడా వచ్చి నేర్చుకుంటున్నారు... అనవసర వ్యాపకాలతో లేని పనులు కల్పించుకుని హడావిడిగా వుండే మా యిద్దరి దృష్టి దైవచింతన మీదకు మరల్చింది. మేము ఈ రోజున విష్ణు సహస్రనామం, లలితా పారాయణ చేస్తున్నాం అంటే- ఆ దంపతులే కారణం. సుశీల సంతోషంగా, రవ్వంత గర్వంగా చెప్పింది... నేను ఆవిడ దగ్గర సంగీతం నేర్చుకుంటున్నాను. ఎన్నో మంచి కృతులు, కీర్తనలు నాకు నేర్పుతోంది.

"ఇవన్నీ చేస్తున్నందుకు వాళ్ళకు మీరు నెలనెలా ఎంత ఇస్తున్నారు?" అని శివరామ్ అడిగాడు.

చంద్రం ఒక్క క్షణం ఆలోచించాడు- "నాకు ఈ విషయమే చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. వారు మా దగ్గర ఏమీ ఆశించలేదు. ఇది కావాలని అడగలేదు. ఇచ్చినది కాదనలేదు. ఇటువంటి దంపతులను నిరాదరణ చేసినవాళ్ళు ఎంత దురదృష్టవంతులో అని అనిపిస్తోంది."

"నీ మాటలు వింటూంటే చాలా గొప్ప వ్యక్తులులాగా కనిపిస్తున్నారు. అటువంటి వారిని తప్పక కలుసుకోవాలి."

"అందుకనేగా మీ ఇద్దరిని ఆహ్వానించింది."

"వారి పేరు ఏమిటన్నారు?"

"ఆవిడ పేరు శివకామ సుందరి. ఆయన పేరు సోమసుందరంగారు... వాళ్ళు మీకు తెలుసా?" అని చంద్రం అడిగాడు.

వాళ్ళేమీ సమాధానం చెప్పలేదు— వాళ్ళ మనస్సులో మసలిన మాట— పోగొట్టుకున్నప్పుడే— ఏ వస్తువు విలువైనా తెలిసేది అని.

"తప్పక రావాలి. అశ్రద్ధ చేయవద్దు" అని చంద్రం ఇంకొకసారి గుర్తుచేసి వెళ్ళిపోయాడు.

మరునాటి రాత్రి విందులో- ఆ పుణ్య దంపతులు వీరి ఇద్దరిని చనువుగా పలుకరించారు. హృదయ పూర్వకంగా ఆశీర్వదించారు.

YOP-22

శివరామ్ ఆయనకు నమస్కారం చేస్తూ "మమ్మల్ని క్షమించి, మన ఇంటికి రండి. మా దగ్గరే వుండండి" అని నెమ్మదిగా అన్నాడు.

ఆయన చిరునవ్వు నవ్వారు... వీరితోబాటు వీధి గుమ్మందాకా వచ్చాడు.

"ప్రపంచకంలో పనికిరాని వస్తువు వుండదు. మనకు పనికిరానిది, వ్యర్థపదార్థం లాగా కనిపించిన వస్తువే వేరొక వ్యక్తికి పెన్నిధి కావచ్చు. బంగారుకొండ అనిపించవచ్చు. పదార్థం ఒకటే- కాని చూసేవారి దృక్పథం బట్టి దాని విలువ వుంటుంది. అలాగే మన ప్రవేశాన్ని అరికడుతూ ఒక ద్వారం మూసుకుంటే మనల్ని ఆహ్వానిస్తూ ఇంకో ద్వారం వెంటనే తెరుచుకుంటుంది. మూసిన ద్వారం వంక చూస్తూ తెరిచిన ద్వారాన్ని గుర్తించలేకపోతాం. మనల్ని వద్దనుకునే వారి దగ్గర కంటే మనం కావాలనుకునే వారిదగ్గర జీవించడంలోనే సుఖం వుంది. శాంతి వుంది. కన్న ప్రేమ, రక్త సంబంధం కన్నా పెంచిన ప్రేమలోనే మాకు సుఖం. నిరాకరించానని మా మీద కోపం వద్దు. ఈ ముసలి వారిని గురించి మంచి ఆలోచనలు మనస్సులో నిలుపుకోండి. శుభమస్తు. గుడ్‌నైట్."

*(ఆకాశవాణి - విజయవాడ కేంద్రం సౌజన్యంతో)*